# మనిషి మంచివాడే...

- భమిడిపాటి సోమయాజి

లలితకుమార్, ఆదరాబాదరా గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. ఇంకా కూర్చున్నాడో లేదో, ఎవరో ఒక వృద్ధుడు "మీ లోయర్ బెర్త్ నాకిచ్చి, నా మిడిల్ బెర్త్ మీద మీరు పడుకుంటారా!" అన్నాడు. "ఇంకా టైమ్ వుంది కదా చూద్దాం!" అన్నాడు లలిత్.

"తాతగారూ!" అంటూ ఆ వృద్ధునికి తెలుసున్న తను పలకరించాడు, అనకాపల్లి స్టేషన్లో.


"బాగున్నావా! నువ్వింకా అనకాపల్లిలోనే ఉంటున్నావా! ఎక్కడికి ప్రయాణం!"

"హైదరాబాద్ ఆఫీస్ పనిమీద బయల్దేరాను," అన్నాడతను.

"ఇక్కడ మిడిల్ బెర్త్ వచ్చింది నాకు, నీది లోయర్ బెర్త్ అయితే దాని మీద పడుకుంటాను" అన్నారు, తాతగారు.

"అయ్యో! దానికేం నాలుగు బెర్త్‌ల తర్వాత వుంది, నా లోయర్ బెర్త్, అది తీసుకుందురుగాని!" అన్నాడు, అతను.

"హమ్మయ్య! "నా మొగుడు నాకే సొంతం"లా, "నా లోయర్ బెర్త్ నాకే సొంతం!" అనుకున్నాడు, లలిత్.



రాత్రి తొమ్మిదిన్నర అవుతోంది! అందరూ నిద్రకి ఉపక్రమిస్తున్నారు. లలిత్‌కి ఎదురుగుండావున్న లోయర్ బెర్త్ ఆసామీ, అప్పటికే నాలుగుసార్లు ఆవలించాడు. రైలెక్కినప్పట్నుంచి చూస్తున్నాడు అతన్ని, లలిత్ "నిద్ర మొహం! ఇతన్ని ఎక్కడో చూసాను! పరిచయమున్న మొహంలా వుంది!" అనుకుంటూన్న సమయంలో లలిత్‌కి తన బావమరిది గుర్తొచ్చాడు! తన బావమరిది నుంచుని కూడా నిద్ర పోగలడు! ఆ నిద్రలో తోటి ప్రయాణీకుల మీద పడి, వాళ్ళు చికాకు పడితే, వాళ్ళని చూసి సిగ్గులేకుండా నవ్వనూ కలడు! ఇంటికెళ్ళిన తర్వాత తన నిద్ర మొహం బావమరిదిని, మళ్ళీ చూడాలన్న బాధతో వున్న లలిత్‌కి, అటువంటి పోలికలుగలవాడు రైల్లోనే తారసపడ్డాడు! విధి బలీయం అనుకున్నాడు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ విజయవాడ వచ్చింది. లలిత్‌కి మెలకువ వచ్చింది. ఎదురుగుండా వున్న లోయర్ బెర్త్ అతను అవతలి వైపు ఒత్తిగిలి పడుకున్నాడు. ఆ బెర్త్ క్రింద, ఓ మనీ పర్స్ కనపడింది. పర్స్ కొంచెం ఒత్తుగానే వుంది. చాలా ప్రయాణాలు చేశాడు గాని, ఎప్పుడూ ఎవ్వరి పర్స్ కనపడలేదు, లలిత్‌కి ఎందుకు కనిపిస్తుంది! ఇటువంటి మూర్తీభవించిన నిద్రమొహం వాళ్ళు బహు అరుదుగా వుంటారు! తన బెర్త్‌మీద నుంచి లేచి చుట్టూ చూసాడు. అందరూ నిద్రలో వున్నారు! లలిత్ చిన్నప్పట్నుంచీ ఫుట్‌బాల్ ప్లేయర్! కాలితో మెల్లిగా పర్స్‌ని బెర్త్‌కింద నుంచి బయటకి లాగాడు. కాలితో కొంత దూరం తరలించుకుపోయాడు. ఇంచుమించుగా బాత్‌రూమ్ సమీపించాడు. "హమ్మయ్య! యిక గోల్ వేసేసినట్లే!" అనుకుంటూ, దాన్ని చేత్తో తీసుకుని, "బాత్‌రూమ్ ప్రవేశం" చేశాడు. ఆశ్చర్యం! అందులో పది అయిదువందల రూపాయి నోట్లున్నాయ్! వెనక్కి వచ్చి, ఆ పర్స్ తన బ్యాగ్‌లో పెట్టేశాడు.

ఓ విధమైన భయం కలిగింది! ఎప్పుడైనా భయమేస్తే, దుప్పటీ కప్పుకుని పడుకోమ్మని, చిన్నప్పుడు వాళ్ళ బామ్మ చెప్పింది! పెద్దవాళ్ళ మాట చద్దన్నం మూట అనుకుంటూ, కలిసొచ్చిన శీతాకాలానికి దండం పెట్టుకుంటూ, ముసుగుతన్ని పడుకున్నాడు లలిత్. మధ్యమధ్యలో మెల్లిగా ఆ దుప్పటీ పైకెత్తి, ఆ పర్స్ పోగొట్టుకున్న ఆ నిద్ర మొహం ఆసామీ ఆ పర్స్ వెతుక్కుంటున్నాడేమోనని అతనికేసి చూసేవాడు. అతనికి అసలు మెలకువే రాలేదు. పాపం! నిద్ర విషయంలో చాలా నిజాయితీపరుడు!

* * *

గోదావరి ఎక్స్‌ప్రెస్ రెండో నెంబర్ ప్లాట్‌ఫాం మీదకి వస్తోందని మైక్‌లో చెపుతున్నారు. తన బ్యాగ్ తీసుకుని సికిందరాబాద్‌లో దిగి పోవడానికి ఆతృతతో వున్నాడు లలిత్.

ఆ నిద్ర మొహమతను లేవకుండా, తను రైలు దిగి పోవాలి! రైలు ప్లాట్‌ఫాం మీదకి రావడం, లలిత్ ధన్ మని రైలు దిగిపోవడం ఒకేసారి జరిగిపోతున్న సమయంలో కంపార్ట్‌మెంట్ దగ్గరకొచ్చిన, ఓ పోలీస్ యిన్‌స్పెక్టర్ని ఫట్‌మని గుద్దాడు లలిత్. ఆ యిన్‌స్పెక్టర్ తనల్ని పట్టుకోవడానికి వస్తున్నాడేమోనన్న భయంతో! తప్పుచేసిన వారి మనస్సు గతి తప్పడంలో ఆశ్చర్యమేముంది!

"ఇడియట్! కళ్ళు కనపడడం లేదా! అని తిడుతూ, "ఇది ఎస్ ఎనిమిది కంపార్ట్‌మెంటేనా" అని లలిత్‌ని అడిగాడు, ఆ యిన్‌స్పెక్టర్.

కొంప మునిగిందేమోనని కంగారుపడుతూ, ఎందుకైనా మంచిదని, "యిది ఎస్ తొమ్మిది"అని చెపుతూ ఆగకుండా స్టేషన్ బయటికి వచ్చేసి, ఆటోలో యింటికి వచ్చేశాడు లలిత్.

* * *

లలిత్ వచ్చిన ఓ పావుగంటకి, అతని యింటిముందు, ఓ మోటార్ సైకిల్ ఆగిన చప్పుడయింది.

లలిత్ కిటికీలోంచి చూశాడు. స్టేషన్లో కనపడిన ఆ పోలీస్ యిన్‌స్పెక్టర్, ఆ నిద్రమొహం వాడితో సహా వచ్చేశాడు.

గబగబా లోపలికి వెళ్ళి "ఎవ్వరైనా మొగాళ్ళని పిలవమంటే, నన్ను మాత్రం బయటికి రమ్మని పిలవకు" అని తన భార్యతో చెప్పి, బాత్‌రూమ్‌వైపు దారి తీశాడు లలిత్.

"మన పెళ్ళై రెండేళ్ళయింది కదా! నాకేం బుద్ధిలేదనుకున్నారా, మగాళ్ళని పిలవమంటే మిమ్మల్నెందుకు పిలుస్తాననుకుంటున్నారు!" అంది శ్రీమతి లలిత్.

ఇంతలో, "ఏం వనజా బాగున్నావా!" అంటూ ఆ నిద్రమొహం వాడు లోపలికి వచ్చాడు.

"ఏమిటి మావయ్యా! ఆశ్చర్యం! చెప్పాపెట్టకుండా వచ్చావ్!"

"అవునే! నీ పెళ్ళై రెండేళ్ళయిపోయింది! మీ అమ్మ అస్తమానూ ఓసారి వెళ్ళి నీ మేనకోడలు కాపురం చూడరా" అని ఒకటే గొడవ! ఏం పెద్ద కష్టమని! అక్కడ గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కి, నిద్రపోతే సికిందరాబాద్ అదే వచ్చేస్తుంది! నీ పెళ్ళికొచ్చినప్పుడు, అయిదువేలు చదివిద్దామని తీసుకువచ్చిన డబ్బు అప్పటి ప్రయాణంలో ఎవడో పర్స్ కొట్టెయ్యడంవలన చదివించలేకపోయాను! ఆ డబ్బు స్వయంగా వచ్చి నీకు అందచెయ్యాలని, నీకు యిన్నాళ్ళూ పంపలేదు! ఇదిగో! ఈ కొత్త పర్స్‌లో పది అయిదువందల రూపాయల నోట్లున్నాయ్. ఈ పర్స్‌తో సహా నీకు ప్రెజెంట్ చేస్తున్నానని, ప్యాంట్ జేబులో చెయిపెట్టి, పర్స్ తీద్దామనుకున్న నిద్ర మొహం మావయ్యకి నిరాశ ఎదురైంది!

"అరే సారీ! వనజా మళ్ళీ పర్స్ పోయింది!" అని తన పోలీస్ యిన్‌స్పెక్టర్ ఫ్రెండ్‌ని పిలిచి, "నా పర్స్ ఎవడో

కొట్టేశాడు. మీరు మీ డ్యూటీ సక్రమంగా చెయ్యటం లేదురా!" అన్నాడు.

"రైల్ ప్రయాణంలో పర్స్ పోతే అది రైల్వే పోలీసుల బాధ్యత! ఈ ఊళ్ళో ఉండగా పోతే మాదీ బాధ్యత! అయినా వాడెవడో ఓ దొంగ మొహంవాడు, నన్ను గుద్దేసి, వాడు దిగిన కంపార్ట్‌మెంట్ "ఎస్ తొమ్మిది" అని చెప్పాడ్రా. అసలు నీ పర్స్ కొట్టేసింది వాడేమోనని నా అనుమానం!"

"వనజా! బైదిబై, వీడు పంజగుట్ట పోలీస్‌స్టేషన్ సర్కిల్ యిన్‌స్పెక్టర్! చిన్నప్పట్నుంచీ కలిసి చదువుకున్నాం! అంచేత చాలా సరదాగా మాట్లాడుకుంటాం! ఏది! మీ ఆయన్ని ఓసారి పిలు యితన్ని పరిచయం చేస్తా!

"ఆయన కూడా గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో యిప్పుడే వచ్చారు మావయ్యా! బాత్‌రూంలో వున్నారు".

"అరె! ఆశ్చర్యం ఇద్దరం ఒకే రైల్లో వచ్చామన్న మాట! సరే! సరే! ఫర్వాలేదు! నేను ఓ నాలుగు రోజులుంటాన్రా! మళ్ళీ కలుద్దాం!" అని పోలీస్ యిన్‌స్పెక్టర్ని సాగనంపాడు, వనజ మావయ్య.

లోపలికి వచ్చి బాత్‌రూమ్ తలుపుకొట్టి, "ఆ వచ్చింది ఎవరో కాదండీ! మా మేనమావా, అతని ఫ్రెండూనూ! అసలు మీరెందుకు లోపలికి పరిగెట్టారో నాకర్థం కాలేదు" అంది, వనజ రహస్యంగా.

"సర్లే! అర్జంట్ నేచర్ కాల్! వస్తున్నా! వాళ్ళిద్దర్నీ కూర్చోమను" అన్నాడు, ఆ యిన్‌స్పెక్టర్, ఉన్నాడో వెళ్ళిపోయాడో తెలుసుకుందామని.

"ఆ పోలీస్ యిన్‌స్పెక్టర్ వెళ్ళిపోయారండీ!"

"నాకదే కావాలి! భగవంతుని దయ!" అనుకుంటూ. పులిలా బయటకి వచ్చాడు.

"మా మావయ్యండీ! ఆయన కూడా గోదావరిలోనే వచ్చారట!"

ఇంతలో మావయ్య, "హార్నీ నువ్వటోయ్! నా ఎదురుగా వున్న బెర్త్‌మీదే పడుకున్నావు కదుటోయ్! అన్నాడు.

"ఔనండీ! రాత్రంతా చాలా నిద్రపట్టేసింది!" అన్నాడు. లలిత్. లేకపోతే ఆ పర్స్ గొడవ తనమీదకి వస్తుందేమోనని.

"అదేమిటి మావయ్యా! మరి ఎదురు బెర్త్‌మీద వున్న ఆయన్ని గుర్తుపట్టకపోవడేమిటి! పైగా మా పెళ్ళిలో ఈయన్ని చూసావుకదా!" అంది వనజ.

"అబ్బో! నీ పెళ్ళి తర్వాత చాలా పెళ్ళిళ్ళకి వెళ్ళాను! అయినా, పాపం! పెళ్ళయిన తర్వాత కొంచెం నీరసపడ్డట్లున్నాడు" అన్నాడు మావయ్య.

పెళ్ళయితే, ఎంత పెద్దవస్తాదైనా నీరసపడడం ఖాయం! అని స్వగతంగా అనుకుంటూ నాకూ మిమ్మల్ని ఎక్కడో చూసినట్లు అనుమానం వచ్చిందండీ! ఆ! యిప్పుడు అర్థమవుతోంది! నా బావమరిదికి నీ (నిద్రమొహం) పోలికలు చాలా వున్నాయ్!" అన్నాడు, లలిత్.

"అన్నట్లు మావయ్య పర్స్ పోయిందండీ!"

"అసలు మీరు నా భార్య మేనమావేనని రాత్రే తెలుసుంటే, మీ పర్స్ పోకపోను!"

"అదెలా!" అన్నాడు మావయ్య.

"రాత్రి తెల్లవార్లూ, మీ వస్తువులన్నింటికీ, నేను నిద్రపోవడం మానేసి, కాపలా వుండేవాడ్నండి" అన్నాడు, లలిత్.

"అబ్బ! నీ మొగుడెంత బుద్ధిమంతుడే! నీకితను భర్తగా లభించడం నీ పూర్వజన్మ సుకృతం!" అన్నాడు, మావయ్య.

"ఈ మాట నిజం మావయ్యా!"

"అది సరే.! నేనొకసారి పంజాగుట్ట స్టేషన్‌కి వెళ్ళి మా ఫ్రెండ్‌ని కలిసి వస్తాను!"

"తొందరేముంది మావయ్యా! సాయంకాలం ఈయన కూడా, నీతో వస్తారు. రేపు మనింటికి మీ ఫ్రెడ్‌ని భోజనానికి పిలుద్దాం" అంది వనజ.

ఆ యిన్‌స్పెక్టరు తనల్ని పర్స్ దొంగిలించిన వానిగా గుర్తుపట్టి, లాఠీతో ఓ నాలుగు పీకుతాడేమోనన్న భయంతో, "నాకు రేపు బహుశ! ఆఫీస్ క్యాంప్ వుండొచ్చు" అన్నాడు, లలిత్.

> **ఈరోజుల్లో అందరికీ గొప్పలెక్కువైపోయాయ్! పదివేలు జీతగాడు తనకి పదిహేను వేలని, గొప్పకి అబద్ధం చెపుతూంటాడు! మా మేనకోడలు చాలా అదృష్టవంతురాలు చాలా మంచి భర్త దొరికాడు ఇతనికి అసలు భేషజం లేదు!**

"మీ ఆఫీసర్ భార్య నాతో చాలా చనువుగా వుంటుంది కదండీ! ఓ నాలుగురోజులు, మా మావయ్య వెళ్ళేవరకూ క్యాంప్‌లో వెయ్యొద్దని, మీ ఆఫీసర్‌తో చెప్పమని, ఆవిడ్ని అడుగుతానులెండి!"

"నీకేం! నువ్వు అడుగుతావు! నేను కనపడితే ఆ పోలీసాయన నా తోలు తీస్తాడు!" అనుకున్నాడు, లలిత్.

"మనం ఫోన్ చేసి చెప్పినా వస్తాడు భోజనానికి. వాడికి ఏ పట్టింపులు లేవు!" అన్నాడు, మావయ్య.

* * *

ఆ మర్నాడు, యిన్‌స్పెక్టర్‌గారు భోజనానికి వచ్చారు. అందరూ కలిసి భోజనం చేస్తూన్న సమయంలో "ఈరోజుల్లో అందరికీ గొప్పలెక్కువైపోయాయ్! పదివేలు జీతగాడు తనకి పదిహేను వేలని, గొప్పకి అబద్ధం చెపుతూంటాడు! మా మేనకోడలు చాలా అదృష్టవంతురాలు చాలా మంచి భర్త దొరికాడు ఇతనికి అసలు భేషజం లేదు!" అన్నాడు, మావయ్య.

"జీతం వరకూ ఎందుకురా! ఎస్ ఎనిమిది కోచ్‌లో దిగి, గొప్పకి ఎస్ తొమ్మిదిలో వచ్చామని, ఒక అంకె పెంచి మరీ చెపుతారు కొంతమంది సన్నాసులు!" అన్నాడు, యిన్‌స్పెక్టర్.

తనల్ని గుర్తుపట్టినట్లు అర్థమైపోయింది, లలిత్‌కి.

పైగా. "మీ మేనకోడలు మొగుడ్ని, ఓసారి సరదాగా పోలీస్ స్టేషన్‌కి తీసుకురారా!" అన్నాడు తన మిత్రుడితో.

స్టేషన్లో వళ్ళు వాయకొట్టడం ఖాయమనుకున్నాడు, లలిత్.

భోజనం చేసి, వెళుతూ వెళుతూ "ఆ! అన్నట్లు నీ డబ్బు అయిదువేలు పర్స్‌తో సహా పోయిందన్నమాట!" అన్నాడు, యిన్‌స్పెక్టర్.

"ఆ పోనీరా ఏం చేస్తాం!" అన్నాడు, మావయ్య.

"నేను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, నీలాంటి స్నేహితుడి పర్స్ పోతే, ఏం చేతకాని వాడిలా ఊరుకుంటానా! నీ ఎదురుగా వున్న బెర్త్‌మీద పడుకున్నవాడ్ని గుర్తుపట్టగలవా!"

లలిత్‌కి చెమటలు పట్టాయ్.

తన మేనకోడలు మొగుడ్ని లోపలేసి చితక్కొడతాడేమోనని, "ఏమోరా నాకు గుర్తులేదు!" అన్నాడు, మావయ్య.

"ఏది ఏమైనా, నీ పోయిన డబ్బు ఓ నెలలోపు నీకు చేరుతుంది, నే వస్తా! టాటా మిస్టర్ లలిత్! అంటూ, నిష్క్రమించాడు యిన్‌స్పెక్టర్.

* * *

మావయ్య వైజాగ్ వెళ్ళిపోయిన ఓ నాలుగు రోజులకి, ఓ పోలీస్ వేన్ వచ్చి, లలిత్ యింటి ముందు ఆగింది! ఇన్‌స్పెక్టర్, వనజతో పిచ్చాపాటీ మాట్లాడిన తర్వాత, "ఈరోజు ఆదివారం నీకు సెలవే కదోయ్ లలిత్! సరదాగా అలా పోయొద్దాం!"అని స్టేషన్‌కి తీసుకుపోయాడు లలిత్‌ని.

స్టేషన్‌కి వెళ్ళిన తర్వాత అసలు, ఆయన నీ భార్య మేనమావ అని తెలిసి కూడా, ఆయన మనీపర్స్ ఎందుకు తీసుకున్నావ్, గొట్టంగాడులే!

"ఏం చేస్తాడులే అని ఆయన పర్స్ దొంగిలించావా!" అంటూ ఓ ఆటమ్ బాంబు పేల్చాడు యిన్‌స్పెక్టర్.

అసలు ఆయన మీ ఫ్రెండ్ అనీ, నా భార్య మేనమ్మావ అని నాకు తెలీదంటూ, ఏడ్చినంత పని చేశాడు లలిత్!

"అసలు నువ్వు ఎస్ ఎనిమిది అని చెప్పి వుంటే నాకనుమానం రాకపోను "ఎస్ ఎనిమిది"ని "ఎస్ తొమ్మిదని" చెప్పి, నా పని సులువుచేశావు అర్థమయిందా."

"క్షమించండి సార్! ఎందుకైనా మంచిదని ఆ డబ్బు జేబులోనే పెట్టుకు తిరుగుతున్నాను. నన్ను నమ్మండి! ఆయన నా భార్య మేనమావ అని తెలీదు ఈ విషయం ఎవ్వరికీ తెలీనివ్వద్దు. ఈ డబ్బు తీసుకుని ఆయనకి అందచెయ్యండి! మళ్ళీ జన్మలో యిటువంటి పని చెయ్యను" అని ఆ యిన్‌స్పెక్టర్ కాళ్ళమీద పడినంత పనిచేశాడు, లలిత్.

"నువ్వు స్వతహాగా బుద్ధిమంతుడవని నేను గ్రహించాను! వెళ్ళు జాగ్రత్త"గా వుండు! అసలు అబద్ధాలాడకూడదు! అందులో పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళతో అసలు ఆడకూడదు. 'అరేయ్! ఎవర్రా అక్కడ! సార్‌ని వేన్‌లో వాళ్ళ యింటి దగ్గర దింపెయ్యండి', జాగ్రత్తగా!

వేన్లో యింటికొస్తూ, "ఆఫీసర్ అంకెల విషయంలో జాగ్రత్తగా వుండు, ఒక్క అంకె తేడా వచ్చినా పీకల మీదకి వస్తుందని అనేకసార్లు చెప్పాడు. ఆయన చెప్పినట్లే అయింది. "ఎస్ ఎనిమిది"ని "ఎస్ తొమ్మిది" అని ఒక్క అంకె తేడా చెప్పి, పీకల మీదకి తెచ్చుకున్నాను" అని బాధపడ్డాడు, లలిత్.

వేన్లో వచ్చిన లలిత్‌ని చూసి "పోలీస్ అంకుల్ చాలా మంచివార్లా వున్నారండీ! ఎక్కువ పరిచయం లేకపోయినా మిమ్మల్ని అంత పెద్ద వేన్లో, అదే పనిగా తిప్పుతున్నారు" అంది వనజ.

"ఆ! అందర్నీ వేన్ ఎక్కిస్తాడేమిటి! నేనంటే చాలా యిష్టపడుతున్నారు, పోలీస్ అంకుల్!" అన్నాడు, లలిత్.

★

రచయిత చిరునామా:
బి.డి.ఎస్.శర్మ
ప్లాట్ నెం.5, శాలివాహన నగర్,
శ్రీనగర్ కాలనీ పోస్ట్,
హైదరాబాద్- 500 073